

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



**హరీ ఓమ్, హరీ ఓమ్**

**హరీ ఓమ్, హరీ ఓమ్....**

కొన్ని సినిమాలు, కొన్ని పాటలు మనస్సులలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. అవి ఎప్పుడు, ఎక్కడ గుర్తుకు వచ్చినా మనసును ప్రశాంతమయం చేస్తాయి. ఎంతటి దుఃఖంలో ఉన్నా, విసుగులో, నిరాశలో ఉన్నా పాటలో మొదటి స్వరం వినపడగానే, టీవీల్లో ఛానల్ మారగానే దృశ్యం మారినట్టు, అంతవరకూ ఆవరించి ఉన్న దుఃఖం, విసుగు, నిరాశలు అదృశ్యం అయిపోతాయి. మహమ్మద్ రఫీ 'హరీ ఓమ్' వినగానే మనకు తెలియకుండానే మనస్సు ధ్యానం మోడ్‌లోకి వెళ్లిపోతుంది. అదీ సంగీతం గొప్పతనం.

హిందీ సినీ చరిత్రలో 1952లో విడుదలయిన 'బైజు బావరా' ఒక మైలురాయి. మైలు రాయి కాదు ,ఒక హిమాలయ పర్వతం. అంతకు ముందు సినీ గీతాలలో శాస్త్రీయ సంగీత ఛాయలుండేవి. కానీ 'బైజూ బావరా'తో శాస్త్రీయ సంగీతం సినిమా పాట ద్వారా సామాన్యులను అలరించటమే కాదు, వ్యాపర పరంగా కూడా లాభాలు ఆర్జించి పెట్టగలదని నిరూపించిన సినిమా 'బైజూ బావరా.'

'బైజూ బావరా' ఒక హిస్టారికల్ ఫిక్షన్ గాధ. సినిమా కథ ప్రకారం తన భవనం చుట్టుపక్కల ఎవరు వచ్చి పాడి తన ఏకాగ్రతకు భంగం కలిగించినా, వారు తనతో పోటీ పడాలని, పోటీలో ఓడిపోతే వారికి మరణ శిక్ష పడుతుందని తాన్‌సేన్ నియమం విధిస్తాడు. అది తెలియక తాన్‌సేన్ ఇంటిముందు 'దాస్ హో తేరే రాం'అని పాడేవారిని రక్షక భటులు తరిమేస్తారు. ఆ తొక్కిసలాటలో బాల బైజు తండ్రి మరణిస్తాడు. దాంతో తాన్‌సేన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని బాల బైజు నిశ్చయించుకుంటాడు.

అనాధ బైజును ఓ దయార్ద్ర హృదయుడు తన గ్రామం తీసుకెళ్లి పెంచుకుంటాడు. అక్కడ బైజుకు గౌరి పరిచయం అవుతుంది. ఊరు మొత్తం బైజు గానానికి మైమరచిపోతుంది. ఈలోగా ఊళ్లోకి దొంగల గుంపు వస్తుంది. దొంగల రాణి బైజూ గానానికి పరవశమై అతడిని తనవెంట తీసుకువెళ్తుంది. అప్పుడు బైజుకు తాన్‌సేన్ పై ప్రతీకారం విషయం గుర్తుకు వస్తుంది. గురువుకోసం వెతుకుతూ 'స్వామి హరిదాసు'ను చేరతాడు. కానీ మనసులో ద్వేష భావన ఉన్న వారికి సంగీతం

బోధన కుదరదని , మనసులో ప్రేమ నింపుకోమంటాడు గురువు. దాంతో పిచ్చివాడిలా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, సంగీతాన్ని ధ్యానిస్తూ తిరుగుతున్న బైజుకు గురువు ధ్యానం వలన ప్రకృతి, ఋతువుల లయతో పలు రాగాలు నేర్పుతుంది. ఆ జ్ఞానంతో పరిణతి పొందిన బైజు గురువు ఆశ్రమానికి వస్తాడు. కానీ గురువు కాలు కదపలేని స్థితిలో ఉంటాడు. 'మురళీధరుడి దర్శనమే చేసుకోలేదు. నిన్ను ఎలా కలుస్తాడు అని శిష్యులు ఆపుతారు. ఆ సందర్భంలో వస్తుంది ఈ పాట.

ఈ సందర్భంగా ఒక విషయం ప్రస్తావించాల్సివుంటుంది. బైజూ అనే గాయకుడు జీవించినట్టు చారిత్రక ఆధారాలున్నాయి. కానీ, ఈయన తాన్ సేన్ కన్నా వయసులో ఎంతో పెద్దవాడు. బైజూ, తాన్ సేన్ ల నడుమ పోటీ జరిగినట్టు ఆధారాలు లేవు. బైజూ కూ అక్బర్ కూ సంబంధాల విషయంలోనూ ఆధారాలు లేవు. తాన్ సేన్ తన ఇంటిముందు ఎవరూ పాడకూడదని నిషేధించనట్టూ ఆధారాలు లేవు. ప్రచారంలో ఉన్న జానపద గాథలను ఆధారం చేసుకుని, దానికి కొన్ని కల్పనలను జోడించి సినిమా రూపొందించారు. బైజూ సంగీతం విషయంలో సాధన చేస్తూ పిచ్చివాడిలా తిరిగేవాడంటారు.సినిమాలో అదే చూపించినా దానికి ప్రేమ కథ జోడిం చారు.

'బైజూ బావరా' శాస్త్రీయ సంగీత ప్రధానమైన సినిమా. అంతకు ముందు వచ్చిన 'సంగీత సామ్రాట్ తాన్‌సేన్' అనే సినిమా సంగీత ప్రధానమైన సినిమా అయినా, ఆ సినిమాలో కుందన్ లాల్ సైగల్ గాయకుడు. ఆయనకు శాస్త్రీయ సంగీతం రాదు. అందుకని సంగీత దర్శకుడు ఖేమ్ చంద్ ప్రకాశ్, శాస్త్రీయ సంగీత రాగాలను ఎంతో సరళం చేసి పాడించాడు. సినిమా సూపర్ హిట్ అయింది. పాటలు అత్యంత ప్రజాదరణను పొందాయి. కానీ 'బైజూ బావరా' సృష్టించినట్టు 'శాస్త్రీయ సంగీతం పై 'పిచ్చి'ని సృష్టించలేదు.

స్వామి హరిదాసు కృష్ణ భక్తుడు. కృష్ణ దర్శనం చేయందే అతనికి రోజు గడవదు. కానీ కాలు పరిస్థితి బాగోలేక కదలలేని స్థితిలో ఉన్నాడు కాబట్టి గురువు దర్శనం లభించే వీలులేదు. బైజూకు గురువు కాలు బాగుకావాలి. సంగీతాన్ని మించిన ఔషధం ఏముంది!

'హరి ఓం' అంటూ పాట ప్రారంభించగానే గురువు ముఖంలో ఆశ్చర్యం అంతకన్నా అందరి ముఖాల్లో ఆశ్చర్యం ఆనందం కలగలసి కనిపిస్తాయి.

ఈ పాటను నౌషాద్ 'మాల్కౌన్స్'రాగంలో రూపొందించాడు. శుద్ధ మాల్కీన్స్ రాగం. మాల్కీన్స్ రాగం గంభీరమైన రాగం. తీవ్రమైన ధ్యానాన్ని కలిగిస్తుంది. ఈ సందర్భం గంభీరమైనది. పవిత్రమైనది. గురువు కృష్ణభక్తిని, బైజూ గురు భక్తిని ప్రదర్శిస్తూ, సంగీత శక్తిని కూడా ప్రదర్శించేపాట.

మహమ్మద్ రఫీ ఈ పాటను పాడాడు అనటం కంటే అనుభవించాడనటం సబబు. 'హరి ఓమ్' దగ్గరనుంచి మాల్కౌన్స్ రాగం చెడకుండా తాన్‌లు, మురిపాలు, భక్తి భావాన్ని ప్రతిఫలించే భావనలు తన స్వరంలో ప్రదర్శిస్తూ పాటను ఒక భక్తి భావ రస ప్రవాహంలా మార్చేశాడు.

అప్రస్తుతమైనా ఇక్కడ ఓ విషయం ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి విజయం సాధించటంలో 'విధి' ప్రభావం తెలిపే సంఘటన ఇది. 'బైజూ బావరా' పాటలు ఆరంభంలో తలత్ మహమూద్‌తో పాడించాలని అనుకున్నారు. సినీరంగంలో అడుగుపెడుతూనే తలత్ మహమూద్ సంగీత దర్శకుల దృష్టిని ఆకర్షించాడు. అతని పట్టు కుచ్చులాంటి స్వరంతో పాడించాలని అందరూ ఉత్సాహపడుతున్నారు. నౌషాద్ సైతం బైజూ బావరా పాటలు తలత్ మహమూద్‌తో పాడించాలని అనుకున్నాడు. కానీ స్టూడియోలో అతడు సిగరెట్ తాగటం నౌషాద్ చూశాడు. వెంటనే రఫీకి కబురు వెళ్లింది. ఈ సినిమా పాటలతో రఫీ ఎంత ఎత్తుకు ఎదిగాడో, తలత్ మహమూద్ అంతగా డిమాండ్ కోల్పోయాడు. కానీ ఇలాంటిదేమీ జరగలేదని నౌషాద్ అంటాడు. ఈ పాటలు రఫీ తప్ప మరో గాయకుడి స్వరంలో ఊహించటం కుదరదు. ముఖ్యంగా పాటలో రఫీ ప్రదర్శించిన భక్తిభావం వల్ల కలిగిన తన్మయత్వం మరొకరు ప్రదర్సించలేరు. రఫీలాగా పాటలో అలంకారాలు వేయటం, చివరలో తన్మయత్వంలో, భక్తిభావంలో సర్వం మరచి 'హరి ఓం ' అంటూ దశదిశలు స్పందించేలా, రాగం, భావం చెడకుండా 'హై పిచ్ 'లో పాడటం మరెవరికీ సాధ్యం కాదు. ఈ పాటలు రఫీ పాడాలని విధి నిర్ణయించింది. ఆ నిర్ణయానికి ఎవ్వరూ ఎదురు నిలవలేరు. అంతే!

ఈ పాటను రాసింది షకీల్ బదాయుని. షకీల్ బదాయుని ఇతర గేయ రచయితలకు భిన్నంగా, వామ పక్ష భావ ప్రభావితుడు కాడు. దైవభక్తి కలవాడు. పాత్ర మనసులో దూరి, గురు దర్శనం కావాలన్న తీవ్రమైన తపనను అనుభవిస్తూ, భారతీయ ధర్మాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్న వాడిలా గీతాన్ని రచించాడు షకీల్. 'మన్ తర్‌పత్' పాట ప్రధానంగా హిందీ పాట అయినా, ఈ పాట తాన్‌సేన్ కాలం నాటిది. అంటే 15 – 16వ శతాబ్దానికి చెందినది కాబట్టి, అప్పటికి హిందీ భాష ఇప్పటి రూపులో లేదు కాబట్టి, సరళమైన హిందీ పదాలతో, బ్రజ భాష పదాలు, సంస్కృత పదాలు కలిపి 'న భూతో నభవిష్యతి' అనదగ్గ భజన గీతాన్ని సృజించాడు షకీల్.

'హరి వోమ్ ' అన్న ఆలాపన తరువాత పాట ఆరంభమవుతుంది.

**మన్ తరపత్ హరీ దర్శన్ వో ఆజ్**

**మోరె తుం బిన్ బిగరే సకల్ కాజ్**

**హో బిన్ తీ కరత్ హూ, రఖియో లాజ్**

మనసు ఈ రోజు హరి దర్శనం కోసం తపిస్తున్నది. నువ్వు లేకపోతే నా పనులు, ఆకాంక్షలు, కోరికలు అన్నీ వ్యర్థమైపోతాయి. నా పరువు కాపాడమని, నేను అభ్యర్థిస్తున్నాను. ఇది పల్లవి.

భజనలు రాసేప్పుడు హింది సినీకవులు వీలయినంత వరకూ శుద్ధ హిందీని వాడారు. ఇతర పాటలలో ఉర్దూ దొర్లినా, భజనల పాటలు వీలయినంత వరకూ శుద్ధ హిందీని ప్రయోగించారు.. 'మన్‌తరపత్' పాటను షకీల్ శుభ్రమైన హిందీ, బ్రజ, సంస్కృత పదాల కలయికతో రాశాడు. 'తుం బిన్ బిగరేసకల్ కాజ్.'

పాట పల్లవిలోనే 'బైజు' తన మనసులో మాట, గురువు మాట కలిపి చెప్పాడు.

'మనస్సు హరి దర్శనం కోసం తపిస్తున్నది'. గురువు పేరు హరిదాసు. ఇక్కడ మనస్సు హరి దర్శనం కోసం తపిస్తున్నది అంటే, బైజు మనస్సు గురువు హరిదాసు దర్శనం కోసం, గురువు మనస్సు హరి దర్శనం కోసం. గురువు దర్శనం కాకపోతే బైజు అనుకున్నది నెరవేరదు. కాబట్టి 'హరి' దర్శనం చేయించి తన పరువు కాపాడమని 'హరి'నే వేడుకుంటున్నాడు బైజూ. హరి దర్శనం లేక గురువు రోజు గడవదు. హరి దర్శనం అవటం, అతని దర్శనం చేయకుండా ఉండలేని గురువు పరువు నిలపటం కూడా అవుతుంది.

**తుమరే ద్వార్ క మై హూ జోగీ**

**హమరీ ఓర్ నజర్ కబ్ హోగీ**

**సునో మోరె వ్యాకుల్ మన్ కా బాత్**

నీ ద్వారం ముందు నిలచి అభ్యర్థిస్తున్న వాడిని నేను. నా వైపు మీ దృష్టి ఎప్పుడు ప్రసరిస్తుంది? అంటే నా పై దయ ఎప్పుడు కలుగుతుంది. వ్యాకులంగా ఉన్న నా మనసు మాట విని నాపై దయ చూపండి.

ఈ చరణంలో 'నజర్' అన్న పదం వాడేడు షకీల్. ఈ పదం అరబిక్ పదం 'నజ్ర్' నుంచి వచ్చింది. 'దృష్టి' అన్న అర్థం. అటునుంచి 'హిందుస్థానీ పదం అయింది. అంటే అటు ఉర్దూ భాషలోనూ ఉంది. ఇటు హిందీ భాషలోనూ ఉందన్నమాట. అయితే శుద్ధ హిందీ వాడాలనుకుంటే 'దృష్టి' అని వాడవచ్చు. కానీ 'హమరి ఓర్ దృష్టి కబ్ హోగీ' అంటే బాగుండదు. బాణీలో పొసగక పోవటం ఒక్కటే కాదు. సరళంగా ఉన్న పదాల నడుమ 'దృష్టి' కఠినంగా వినిపిస్తుంది చెవులకు.

ఇక్కడే మనకు షకీల్ చేసిన చమత్కారం తెలుస్తుంది. సూరదాసు భజనలోని భావాన్ని మరింత సరళంగా ప్రదర్శించాడు. ప్రసిద్ధ సురదాను భజన ఉంది.

'అఖియాన్ హరి దర్శన్ కీ ప్యాసీ' అంటే కళ్లు హరిదర్శన దాహంతో తపిస్తున్నాయని అర్థం. 'మన్ తరపత్ హరి దర్శన్ కో ఆజ్'

సూరదాస్ ప్రభు తుమ్హారే దరస్ బిన్

లోహీ కర్వట్ కాసీ...

ఇది పూర్తిగా భక్తి పారవశ్యంలో ఉత్కృష్ట స్థితి. హరి దర్శనం లభించకపోతే సూరదాస్ కాశీలో 'కాశీ కర్వట్' అని ఓ మందిరం ఉంది. ఆ మందిరం చుట్టూ ప్రదక్షిణ చేస్తూంటే, ఒక బాట సన్నని రంపంలాంటి బాట వస్తుంది. మోక్ష కాంక్ష తీవ్రంగా కలవారు అక్కడినుంచి గంగలో దూకి ప్రాణాలు సమర్పిస్తారు. హరి దర్శనం లభించకపోతే సూరదాసు కూడా కాశీకి వెళ్లి ప్రాణార్పణం చేస్తానంటున్నాడు. అయితే, సినిమా సందర్భానికి అంత తీవ్రమైన కాంక్ష అవసరంలేదు. అందుకని 'హరి దర్శనం కోసం తపన' అన్నది మాత్రం తీసుకున్నాడు షకీల్.

**బిన గురు జ్ఞాన్ కహాసే పావూ**

**దీజో దాన్ హరి గుణ్ గావూ**

**సబ్ గుణీ జన్ పే తుమరా రాజ్...**

సులభంగా అర్థమైపోతుంది. సినిమా సందర్భంలో నాయకుడిది హరి దర్శన తపన కాదు. గురు దర్శన తపన. కాబట్టి, పాట హరి నుంచి గురువు వైపుకు వచ్చింది. నిజానికి, అందరి గురువూ "హరి" యే!

గరువు లేకుండా జ్ఞానం పొందటం కుదరదు. జ్ఞానదానం చేస్తే తానే హరి గుణగానం చేస్తానని అంటున్నాడు." శ్రేష్టులకే రాజువు నీవే" అంటున్నాడు గురువుని.

భారతీయ ధర్మంలో పరిజ్ఞానానికి ప్రాధాన్యం లేదు. పుస్తక పరిజ్ఞానానికి ప్రాధాన్యంలేదు. పుస్తకం బట్టీపట్టి చిలుకపలుకులు వల్లించేవాడిని భారతీయ ధర్మం గొప్ప విజ్ఞానవంతుడిగా పరిగణించదు. అతడు కేవలం పండితుడే. నిజమైన విజ్ఞానవంతుడు గురువు దగ్గర శుశ్రూష ద్వారా విజ్ఞానాన్ని గ్రహించినవాడు. "గురువు"ను ఇప్పుడున్న అర్థంలో తీసుకోకూడదు. మన ధర్మంలో గురువు అన్నది ఎంతో లోతయిన అర్థం కల పదం. అంతకుముందు సినిమాలో బైజు గురువును ధ్యానిస్తూ, ప్రకృతి ఆధారంగా విభిన్నమైన రాగాలను దర్శిస్తాడు.

గురువు బైజూకు సంగీతం నేర్పు నిరాకరించినా, బైజు, మందిరంలో గురువును ధ్యానిస్తూంటే, ఆయన మదిలో దర్శనం ఇస్తూ బోధిస్తాడు సంగీతం. అద్భుతమైన రూపకల్పన, చిత్రీకరణ ఈ దృశ్యాలది. అలా, రాగ్ లలిత్( పియూ పియూ కరత్ పపీహా), గౌడ్ మల్హార్( ఝూం ఝూం బదరియా బర్సే), పూరియా( అజబ్ తేరి అన్ బన్), బాగేశ్రీ( ఏరీ ఐ

మై కైసే ఆవూ) వంటి రాగాలను, బందిష్ లను సాధన చేసి నేర్చిన తరువాత "మన్ తరపత్" పాట పాడతాడు.ఇంత సాధన చేసి, ఇన్ని రాగాలను నేర్చి కూడా, తానో పండితుడను అనుకోడు. " బిన్ గురు జ్ఞాన్ కహాన్ సే పావూన్?" అంటాడు. గురువు ఇచ్చిన ఈ జ్ఞానంతో హరి గుణగానం చేస్తాడు. భారతీయ ధర్మంలో భగవంతుడికి సంబంధించిన జ్ఞానమే అసలు జ్ఞానం. శాస్త్రాలు, కావ్యాలు, కళలు అన్నీ భగవంతుడిని చేరే మార్గానికి దారి చూపేవే. ఆ మార్గానికి దారి చూపితేనే వాటికి సార్థకత. లేకపోతే ఎంత గొప్ప సృజన అయినా పనికిరానిదే!

మనిషి శరీరంలో ప్రతి అంగం, శరీరంపైని ప్రతి రోమం, జీవితంలో ప్రతి క్షణం, ఆలోచన, సృజన సర్వం భగవంతుడికి సంబంధించిందే అయి ఉండాలి. అందుకే జ్ఞానం ఇస్తే హరిగుణ గానంలోనే జీవితం గడుపుతానని వాగ్దానం చేస్తున్నాడు. గురువు నుంచి గ్రహించిన జ్ఞానమే అసలైన జ్ఞానం. అసలైన జ్ఞానం గ్రహించాలంటే మానసిక పరిణతి అవసరం. అందుకే ప్రతీకార భావన ఉన్నపుడు సంగీతం నేర్పను పొమ్మన్నాడు గురువు. తరువాత మళ్లీ ప్రతీకార భావం ఉన్నదని తెలియగానే ఆశ్రమం నుంచి పంపిచేస్తాడు. అందుకే ప్రాచీన కాలంలో గురువులు శిష్యుడిని పరిశీలించి, మానసిక పరిణితిని పరిశీలించిన తరువాతనే శిష్యునిగా స్వీకరించేవారు.

పాట పాడుతున్న కాలంలో, అందరూ ఆశ్చర్యపోయే రీతిలో గురువు బాగాలేని కాలు ఆధారంగా నడుస్తూ వస్తాడు. గురువు నడుస్తూ వచ్చేందుకు తలుపు దగ్గరకు వస్తూండగా పాట పూర్తవుతుంది. ఈ పాట విని తన్మయులైన వారు తేరుకుని సంగీత వాయిద్యాలు మ్రొయిస్తూ వస్తారు. అప్పుడు పాట వేగవంతమవుతుంది 'తన్మయత్వం పెరుగుతుంది. తనువూ, మనసూ ఊగుతాయి.

**మురళి మనోహర్ ఆస్ న తోడో**

**దుఖ్ భంజన్ మోర సాథ్న ఛోడో**

**మొహె దర్శన్ భిక్షా దేదో**

**మొహె దర్శన్ బిక్షా దేదో ఆజ్, దేదో ఆజ్**

నాకు ఆశాభంగం కలిగించకు. దుఃఖాన్ని నశింపచేసేవాడా నన్ను వెన్నంటి ఉండు. నాకు దర్శన భిక్ష ప్రసాదించు.

ఇక్కడ పాట వేగవంతమవుతుంది. పాట రాగం మారినట్టు అనిపిస్తుంది. కానీ పాట మాల్కౌన్స్ రాగంలోనే ఉంటుంది. ఒకో చరణానికీ రఫీ స్వరం స్థాయి పెరుగుతూంటుంది. గురువు ఒకో అడుగు వేస్తూ కుటీరం ద్వారం వద్దకు వచ్చి దర్శనం ఇస్తాడు. మోహె దర్శన్ భిక్ష దేదో ఆజ్, అంటూ రెండోసారి "దేదో ఆజ్" అన్నప్పుడు గురు దర్శనం కావటంతోటే అందరిలో ఉత్సాహం హెచ్చుతుంది. తన్మయత్వం పెరుగుతుంది. పాట వేగం పెరుగుతుంది. నృత్యం వేగం

పెరుగుతుంది. ఒకో మెట్టూ ఎక్కుతున్నట్టు బైజూ 'హరి ఓం' అంటూ తన స్వర స్థాయిని పెంచుతూంటాడు. బైజూ స్వరం స్థాయి పెరిగిన కొద్దీ, గురువు మెట్లు దిగే వేగం పెరుగుతుంది. వేగవంతమవుతున్న సంగీతం నుంచి గురువు శక్తిని గ్రహిస్తున్నట్టు అనిపిస్తుంది.

**మురళి మనోహర్ మోహన గిరిధర్ హరి ఓమ్**

**హరి ఓమ్**

**మురళి మనోహర మోహన గిరిధర్ హరి ఓమ్**

**హరి ఓం**

**హరి ఓం**

**హరి ఓం**

**హరి ఓం**

**హరి ఓం**

**హరి ఓం...**

అద్భుతమైన చిత్రీకరణ ఈ సందర్భంగా చూడవచ్చు. ఓ వైపు తబలా, ధోలక్ లు మ్రోగుతూంటాయి. అంతా నృత్యం చేస్తూంటారు. వేగం పెరుగుతూంటుంది. గురువు ఒకో మెట్టు దిగుతూంటే, మెట్లు దిగుతున్న గురువును, కృష్ణుడి విగ్రహాన్ని, నృత్యం చేస్తున్న వారిని, పాడుతున్న బైజూను వెంట వెంటనే చూపిస్తూ ఉవ్వెత్తున ఎగసిపడే గొప్ప ఆనంద తరంగాన్ని సృష్టిస్తారు కళాకారులు. సంగీతం, కెమేరా పనితనం, నటన, ఎడిటింగ్ సర్వం అత్యున్నత స్థాయిలో ఉండి, కృష్ణ దర్శనం కాగానే ఆనంతానందాన్ని అనుభవించిన భావనను కలిగిస్తాయి. సుఖంతో, సంతృప్తితో, ఆనందంతో ప్రేక్షకుడు విడిచే నిట్టూర్పును ప్రతిబింబిస్తూ, వేణువు మ్రోగుతుంది. పాట పూర్తయ్యేసరికి భగవద్దర్శనం అయిన భావన కలుగుతుంది.

ఈ పాట వింటున్నంత సేపూ, చూస్తున్నంత సేపు సర్వం మరచిపోతాం. గురువు కృష్ణ దర్శనం తప్ప మరేమీ మనసు ఆలోచించదు. ఇంత అద్భుతమైన కళను మామూలుగా సృజించటం కుదరదు. కళాకారులు తామే భావనలైపోవాలి. కళలో గొప్పతనం సృజనలో కన్నా, ఆ కళను సృజించిన మనస్సులోని భావన తీవ్రత, శుద్ధత్వంలో ఉంటుంది. కళాకారుల చిత్తశుద్ధిపై కళ ప్రభావం ఆధారపడి ఉంటుంది .కళలో కళాకారుల మనస్సు ప్రతిబింబిస్తుంది.

అందుకే, కొందరు ఈ పాటకు సంగీతం కూర్చిన నౌషాద్ ముస్లిం, రాసిన షకీల్ ముస్లిం, పాడిన రఫీ ముస్లిం అనీ, ఈ పాట లౌకికతత్వానికి గొప్ప ఉదాహరణ అనీ అంటూంటారు. ఇంకొందరు ఇది వారికి ఒక ఉద్యోగంలాంటిది. డబ్బులు తీసుకున్నారు. పని చేశారు. అంతే, దీన్లో లౌకిక తత్వం ఏమీలేదని వాదిస్తారు.

'కళ'ను 'కళ'గా చూడలేని సంకుచిత సమాజంగా ఎదుగుతున్నది మన సమాజం. కళను అనుభవించాలి కానీ, అది సృజించింది, హిందువా, ముస్లిమా? డబ్బులు తీసుకుని కళను సృజించారా? అన్న ఆలోచనలు రావటమే పొరబాటు. 'మన్ తరపత్ హరి దర్శన్' పాట వింటూంటే సంగీత దర్శకుడు గుర్తుకురాడు. గేయ రచయిత గుర్తుకు రాడు. నటులు గుర్తుకు రారు. గాయకుడు గుర్తుకు రాడు. సరస్వతీదేవి గుర్తుకు వస్తుంది. సంగీతం, సాహిత్యం కలగలసి సృష్టించగల బ్రహ్మానందం అనుభవానికి వస్తుంది. భగవద్దర్శనం కోసం తపన, దర్శనం వల్ల కలిగే అనంతానందం మనసు గ్రహిస్తుంది. అంతే... ఇదీ కళ పరమోత్తమ స్వరూపం, కళాసృజన పరమోత్తమ లక్ష్యం. కళను సృజించటంలో మనుషులు నిమిత్తమాత్రులు కళ సరస్వతి. అంతే! కళలో అడుగడుగునా సరస్వతీదేవి చమత్కృతిని అనుభవిస్తూ, భగవద్దర్శనం మార్గంలో ప్రయాణించాలి. బాకీసబ్ బక్వాస్!

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments on this story